
# చేదుయాత్ర

ముకాణి



సాయంత్రం ఆరుగంటలు—

శేఖరం గడియారంవంక ఓసారి చూసుకున్నాడు. నిమిషాలముల్లు సన్నగా ముందుకు కదిలిపోతుంది—లైబ్రరీలో అప్పటికే చాలా మంది వెళ్లిపోయారు. వరండాలో కుర్చీలు బోసిగా ఖాళీగా పడిఉన్నాయి ప్రక్కనున్న కిటికీలోనుండి వచ్చినగాలికి టేబిల్‌మీది న్యూస్‌పేపర్లు గలగల లాడాయి. దూరంగా వరండాచివర అరవైఏండ్ల ముసలాయన కండ్లజోడు సవరించుకుంటూ 'ఏదో చదువు కుంటున్నాడు—

లైబ్రరీబోయ్ వచ్చి స్విచ్‌వేసి దీపాలు వెలిగించాడు—

శేఖరం దృష్టిమరల్చి, చేతిలోని పత్రిక టేబిల్‌మీద పడవేశాడు. ఇంకా చీకటి పడకముందే ఇంటికి చేరుకోవాలి... ఇంటి దగ్గర శారద ఒక్కర్తీ తనకోసం ఎదురు చూస్తుంటుంది. చదవటానికి బొత్తిగా ఏవీ పుస్తకాలులేవు ... కాస్త జ్ఞాపకం ఉంచుకుని వచ్చేటపుడు కొన్ని 'శరత్‌బాబు' నవలలు లైబ్రరీలోనుండి పట్టుకు రండి' అని వచ్చేటపుడు శారద మరీ మరీ చెప్పింది. శారదకి శరత్‌బాబు పుస్తకాలంటే చాలా ఇష్టం...చదివిన పుస్తకాన్నే తిరిగి చదవటానికి శారదకి ఎంతమాత్రం విసుగేయదు. అందుకే శేఖరం ఒక్కోసారి అనుకుంటూ ఉంటాడు. నార్మల్‌గా ఉన్న స్త్రీ ఎప్పటికీ అలాగే ఉండిపోతుంది— ఎన్ని యుగాలైనా అమనస్తత్వం మారదూ' అని. శారద చిరుకోపం ప్రదర్శిస్తుంది. శేఖరం నిండుగా నవ్వుతాడు శారదకోపం చూసి—

ఇంకో అరగంటకి లైబ్రరి మూసేస్తారు.

శేఖరం ఎత్తయిన బీరువా దగ్గరికి నడిచాడు — దాన్నిండా తెలుగు పుస్తకాలు కట్టలు— కట్టలుగా పేర్చి ఉన్నాయి— ఒకమూల 'శరత్‌బాబు సాహిత్యం' మొత్తం ఆర్డరులో చక్కగా పేర్చి ఉంది: ఓక్షణం ఆలోచించాడు శేఖరం. క్షణం తరువాత 'చరిత్రహీన' తీసుకున్నాడు. 'ఫర్వాలేదు— ఇవ్వాళ్టికి ఇది తీసుకుపోతే మరి రెండు రోజులతర్వాత ఇంకొహటి పట్టుకెళ్ల వచ్చు...'

రిజిష్టర్‌లో పేరువ్రాయించి పుస్తకం తీసుకొని బయటకు నడిచాడు. ఇంకో పది

నిమిషాల్లో వాన ప్రారంభమయ్యే సూచనలు — మేఘాలు నల్లనిరంగు పులుముకుని ఆకాశంలో షికారు చేస్తున్నాయి—చల్లని గాలి ఒంటిని తాకి కిలకిలలు పెడుతుంది— 'గబగబ ముందుకునడుస్తూ, చేతిలోని పుస్తకాన్ని ఓసారి చేతితో విడదీశాడు. శేఖరానికి చాలా ఆశ్చర్యంవేసింది—పుస్తకం మధ్యనుండి పొడవైన తెల్లనికాగితం బాగా మడతలు పడినట్టునంటి ఉత్తరం ఒకటి క్రింద పడింది. గబుక్కునవంగి దాని మడతలు విడదీశాడు మామూలు తెల్లకాగితంమీద సిరాతో వ్రాసిన వ్రాత కనిపించింది— ఇది ఎవరిది కావచ్చు—

ఉత్తరంలో ఎలాంటి సంబోధనా లేదు—

...మీ కోసం ఎదురు చూసి—చూసి విసుగెత్తింది. మీరు పెట్టిన గడువుకూడా చాలా రోజులక్రితమే తీరిపోయింది. మీరు రాకపోవడం చాలా సహజం—ఇంకా మీరు వస్తారనికూడా అనుకోవడం లేదులెండి— అయినా నాకు ఉండ బుద్ధేయక మీకిది వ్రాస్తున్నాను. కోపగించకండి ! స్వయంగా మీ దగ్గరకుకూడా రాలేనిపరిస్థితి—

ముఖ్యవిషయం—

'మోతీకి ఆడపిల్ల.. మీకిది చాలా బాధాకరంగా ఉండవచ్చు కాని కఠిన సత్యాన్ని—ఫలాన్ని కాదనగలమా... మోతీ ఎవరెన్ని బాధలుపెట్టినా మీపేరుమాత్రం బయట పెట్టలేదు చాలా విచిత్రం గదూ ! నిజంగా స్త్రీ అనిపించుకుంది—పాప అచ్చం మీ పోలికే! మోతీని కులంలోని వాళ్ళంతా వెలివేశారు—దీనికికూడా మోతి ఏమీ బాధపడడంలేదు. మోతీ నాన్న మోతీకి తిరిగి పెండ్లిచేస్తానంటున్నాడు—

పుట్టిన పాపచేయి ఒకటి నరికేస్తే పాపం పరిహారమవుతుందని తీర్మానంచేశారు చూశారా ! మనంచేసిన పనులకు, ప్రతిఫలాలు ఎంతదూరాన ఎన్నిరోజుల తర్వాత చక్కగా ప్రతిఫలిస్తాయో — ఆవిధంగా ఆ పాపను అవిటిదాన్నిచేస్తే, తల్లిని వదిలి దూరంగా ఎక్కడో — బిక్షం ఎత్తుకుని పొట్టపోసు కుంటుందని దాని వెనుకగల అసలు ఆలోచన-రహస్యం— భారతదేశంలో అవిటిదాన్ని చూస్తే ద్రవించే హృదయాలు ఇంకా కొన్ని ఉన్నాయి—

ఈ విషయాలన్నీ మోతీ మీకు తెలియపరచమంది...అందుకే ... శేఖరం ఆత్రంగా త్రిప్పిచూశాడు — ఇంకేమీ వ్రాసిలేదు— తర్వాత ఇంకో కాగితం ఉండిఉండాలి — పుస్తకాన్ని జాగ్రత్తగా పరిశీలించి చూశాడు ఇంకెలాంటి కాగితం కనిపించలేదు. నిరాశతో ఒకసారి చేతిలోని పుస్తకం వంకా—కాగితవంకా—చూశాడు ఇది ఎవరి ఉత్తరం కావచ్చు ... రివ్వున చల్లటిగాలి వీచింది—శేఖరం ఆకాశంవంక ఓ సారిచూసి వడివడిగా ఇంటివేపు అడుగులు వేశాడు.

దారినిండా ఉత్తరాన్ని గురించిన ఆలోచనలే—

ఇది ఈ పుస్తకంలోనికి ఎలా వచ్చి ఉండాలి. అందులోని విషయం చాలా ఇంటరెస్టింగ్‌గా అనిపించింది. దానిముందు విషయంగాని, తర్వాత సంగతులుగాని ఏవిధంగా ఆలోచించబోయినా ఆలోచనలు ఏమాత్రం ముందుకు సాగడంలేదు—ఉత్తరాన్ని జాగ్రత్తగా జేబులో భద్రపరచుకుని బస్సెక్కాడు.

బయట సన్నని వాన తుంపర మొదలయింది:

* * *

'ఈ పుస్తకం ఇంతకుముందు ఎవరికి 'ఇష్యూ' చేశారో చెప్పగలరా...

లైబ్రేరియన్‌ను శేఖరం నెమ్మదిగా అడిగాడు. లైబ్రేరియన్ ఎందుకన్నట్టు ప్రశ్నార్థకంగా చూశాడు:

'అబ్బ ... బ్బె ... పెద్ద పనేమీలేదు .. 'ఊరికే'. .చాలా తేలికగా మాటలను తేల్చివేశాడు శేఖరం—

పెద్ద రిజిష్టరులోని కొన్ని పేజీలను త్రిప్పి, లైబ్రేరియన్ శేఖరానికి సమాధానం చెప్పాడు. 'దీన్ని నిన్న మధ్యాహ్నమే ప్రసాదరావుగారు రిటర్న్ చేశారు...

'ప్రసాదరావుగారు ... పేరును రెండు సార్లు నెమరువేసుకున్నాడు శేఖరం...

'ఆయన్ని మీరు ఎరగరా...లైబ్రేరియన్ నవ్వుతూ ప్రశ్నించాడు. తెలీదన్నట్టు తలూపాడు శేఖరం.

'దయచేసి ఆయన అడ్రసు ఇవ్వగలరా' ...శేఖరం ఓక్షణం ఆగి అడిగాడు-లైబ్రేరియన్ చెప్పాడు. శేఖరం ఉత్సాహంతో లైబ్రరీనుండి బయలుదేరాడు.

ఒకవేళ ఇది ప్రసాదరావుగారి 'పర్సనల్' విషయం కావచ్చు. తనకు ఇందులో తల దూర్చవలసిన అవసరాన్ని గురించి ఆయన ప్రశ్నిస్తే...ఏటు పాలుపోలేదు శేఖరానికి— పరిస్థితి చూడబోతే ఎలాగైనా అసలు విషయం తెలుసుకోవాలని మనసు పీకుతుంది ఆయన ఏమనుకున్నా అనుకోవచ్చు ...అయినా తాను ఆయన ఉత్తరాన్ని ఆయనకు రిటర్న్ చేస్తున్నప్పుడు ఎందుకు ఏవిధంగా భావిస్తాడు అందులోనూ ఆయన తన ఉత్తరాన్ని పుస్తకంలో మరచిపోయి ఉన్నారు కదా...

సంపం ఆలోచనలను ఆపుచేశాడు

ఎదురుగా పెద్ద గేటు. గేటుకు కొంచెం దూరంలో అందంగా...పొందికగా కట్టబడిన తెల్లమేడ ... మేడముందు రంగురంగుల 'క్రోటన్స్' అందంగా తొట్లలో అమర్చబడి ఉన్నాయి ఎవరో చెట్లకు నీళ్ళు పోస్తున్నారు - గేటుదగ్గరనుంచే ఓక్షణం లోనికి పోవాలా వద్దా అని తటపటాయించాడు.

'ఎవరు కావాలి బాబూ ..శేఖరం అడిగే లోపులోనే తోటమాలి చేతిలోని బకెట్ క్రిందపెట్టి శేఖరాన్ని ప్రశ్నించాడు.

'ప్రసాదరావుగారి ఇల్లు ఇదే కదూ...?

'బాబుగారికోసం వచ్చారా ... రండి ... సాదరంగా గేటుతీసి లోనికి ఆహ్వానించాడు తోటమాలి నున్నటి సిమెంటు బాటమీద చిన్నగా అడుగులు వేసుకుంటూ మేడను సమీపించాడు శేఖరం ... ఇంటిలో కనిపిస్తున్న వస్తువులతీరు — అలంకరణ చూస్తుంటే ఇంటి యజమాని మనస్తత్వాన్ని ఊహించుకోబుద్ధేసింది.

'ఇలాకూర్చోండి . తోటమాలి శేఖరానికి ఓ సోఫా చూపించాడు—శేఖరం చుట్టూ హాలుగోడలను పరీక్షిస్తూ సోఫాలో కూర్చున్నాడు

'పది నిమిషాల్లో బాబుగారు వస్తారు ... కూర్చోండి. తోటమాలి బయటకు వెళ్ళిపోయాడు—శేఖరం చుట్టూ గోడలకు అలంకరించబడిన పెయింటింగ్స్ చూస్తూ కూర్చున్నాడు క్రింద గులాబీరంగు తివాచీ అందంగా పరచి ఉంది...ఎదురుగా టేబిలు మీద బుద్ధుని పాలరాతి విగ్రహం,పక్కనే — ఫ్లవర్‌వాజ్ నిండా అప్పుడే వికసించిన ఎర్రని రోజాపూలు ... వాతావరణం చాలా ఆహ్లాదకరంగా కనిపించింది.

'నమస్కారం .'

శేఖరం చటుక్కున ప్రసాదరావుగారికి

నమస్కరించాడు. ఆయన గంభీరంగా నవ్వాడు. వయసు దాదాపు యాభై ఏండ్ల పైనే ఉంది ... అపుడపుడే నెరుస్తున్న జుట్టుతల...నోట్లో పెద్దచుట్ట ... చేతికి తళుక్కుమని మెరుస్తున్న ఉంగరం. మనిషి చాలా నిండుగా కనిపించాడు:

'కూర్చోండి'...శేఖరం కూర్చున్నాడు — ప్రసాదరావుగారు చుట్ట విదిల్చి ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు. లోపలనుండి నౌఖరు నౌనంగా ట్రేలో కాఫీతెచ్చి టేబిలుమీద పెట్టాడు—

రెండు నిమిషాల్లో శేఖరం తన పరిచయం చెప్పాడు. ప్రసాదరావుగార్ని చూస్తుంటేనే శేఖరానికి చాలా ముచ్చట వేసింది. ఆయన మాట్లాడుతుంటే ఇంకా కొన్ని గంటలు ఆయనతో మాట్లాడాలని పించింది. జేబులోని కాగితాన్నితీసి ఆయన కందించాడు —

'ఈ ఉత్తరం చూడండి...నిన్న లైబ్రరీలో శరత్‌బాబు 'చరిత్రహీన' నవలలో దొరికింది — మీకు చాలా ముఖ్యమైనది కావచ్చనుకున్నాను. లైబ్రేరియన్‌ను అడిగితే మీ అడ్రసు ఇచ్చాడు'

ప్రసాదరావుగారు ఓ నిముషం అగి బిగ్గరగా నవ్వారు...

'అవునవును...నా దగ్గర శరత్ 'చరిత్ర హీన' లేదు—అందుకే లైబ్రరీలో నుండి తెప్పించాను. ఇది అందులో మరచిపోయి ఉంటాను — థాంక్స్...మీ శ్రద్ధకు నా అభివందనములు...' ప్రసాదరావుగారు ఓ క్షణం ఆగి చిన్నగా నవ్వాడు—

'మీరుచాలా శ్రమపడ్డారు...నిజానికి ఇది ఉత్తరంకాదు.

శేఖరం బిత్తరపోయాడు—'మరి'

'నేను అపుడపుడు మనసు బాగాలేనపుడు కథలు వ్రాస్తుంటాను. అలాంటపుడే చాలా సహజమైన భావాలు కాగితంమీద పెట్టగల ననిపిస్తుంది. అయితే ఇంకో ముఖ్యమైన విషయం. సాధారణంగా వాటిని ఎవరికీ చూపించను. ఎవరో ఒకరిద్దరు ముఖ్య స్నేహితులకుతప్ప పత్రికలకు అసలు పంపించను. మనలోకలిగిన భావాలను నలుగురికి పంచి మన వ్యక్తిత్వాన్ని అందరిముందు పంచడం నాకు ఇష్టముండదు!

చిన్న పిల్లాడిలా గలగల మాట్లాడుతున్న ప్రసాదరావుగారిని చూస్తుంటే శేఖరానికి చాలా ముచ్చటవేసింది. మొత్తానికి చాలా విచిత్రమైన వ్యక్తిత్వం ఈయనది. శేఖరం గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు.

'అయితే ఇది ఉత్తరం కాదన్నమాట!'

ప్రసాదరావుగారి కనుబొమలు ఓక్షణం ముడిపడ్డాయి వెంటనే గలగల నవ్వేశాడు.

'కథలో ఒక ఉత్తరం వ్రాసే సన్నివేశం అది...నిన్నదాన్ని తిరిగి ఓసారి చదివి చూద్దామని వెతుకుదును కదా ఈకాగితం ఒకటి కనిపించలేదు—ఎక్కడ పెట్టానో ఎంత ఆలోచించినా గుర్తుకు రాలేదు... ఓక్షణంఆగి తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు ప్రసాదరావుగారు.

శేఖరం బయట తోటలోనికిచూసి నెమ్మదిగా ప్రసాదరావుగారివేపు తిరిగాడు—శేఖరానికి ఆయనంటే మనసులో చాలా పూజ్య భావం కలిగింది.

'చిన్నమనవి'... ఆకథ 'చాలా' ఇంట్రెస్టింగ్‌గా' ఉంది నాకుఇస్తే చదివి వెంటనే ఇచ్చేస్తాను.'

'ఎలా...నా స్నేహితుడు తీసికెళ్ళాడే... ఈమధ్య కాగితం కూడా ఇవాళ పంపించాలి...' శేఖరానికి అదోలా అనిపించింది. ఒక నిరాశవంటిది అంతరాంతరంలో క్షణకాలం కలిగింది.

'పోనీ...మీకభ్యంతరం లేకపోతే ఆకథను ఓమారు నాకు వినిపించండి.'


'సరే...'ప్రసాదరావుగారు వెంటనే ఒప్పుకున్నాడు. పెట్టెలోనుండి ఇంకో క్రొత్త చుట్టతీసి, అగ్గిపెట్టెతీసి వెలిగించాడు. శేఖరం సర్దుకుని కూర్చున్నాడు—టేబిలుమీద 'చరిత్రహీన' క్రింద ఉత్తరంగాలికి రెపరెప లాడుతుంది—

ప్రసాదరావుగారు నోటిలోనుండి పొగ బయటకు వదులుతూ ప్రారంభించాడు.

'కథలగురించి నీ అభిప్రాయ మేమిటోయ్...' ఉన్నట్టుండి ప్రసాదరావుగారు సూటిగా శేఖరాన్ని ప్రశ్నించేసరికి శేఖరం బిత్తరపోయాడు—

'కథ అనేది స్వానుభవం కావచ్చు... అనుభవంతో కూడుకున్నది కావచ్చు... కేవలం ఊహా నిర్మితమైనది కావచ్చు...నా ఉద్దేశంలో ఊహాల్లో కనిపించేటంతటి వాస్తవికత—సహజత్వం మామూలు జీవితంలో కనిపించదు...ఎందుకంటే నేటి సామాజిక వ్యవస్థలో సహజంగా ఎవరూ బ్రతకడంలేదు. కనీసం ఊహాల్లోనయినా వాస్తవాన్ని అంగీకరిస్తే చాలు...

'ఒక పట్టణంలో ఒకపెద్ద ధనిక కుటుంబం ఒకటి ఉండేది. ఆ కుటుంబం లోని చిట్టచివరి యువకుడు కళాశాలలో బి. ఏ. చదువుతున్నాడు—చాలా గొప్ప చిత్రకారుడు. రకరకాల ప్రకృతి దృశ్యాలను ఇతరబొమ్మలు గీసి చాలాపేరు సంపా



## గ మ ని క

ఉత్తరాల శీర్షికకి రాసేవారు ఈ కింది నియమాలు పాటించాలని మనవి: 1. ఉత్తరాలు వీలయినంత చిన్నవిగా ఉండాలి 2. రాసేవారి పూర్తి పేరు, చిరునామా ఇవ్వాలి 3. ఇంగ్లీషు లిపిలో అక్షరాలు రాయరాదు 4. కాగితానికి ఒకవయిపునవే రాయాలి. 5. సిరాతోనే రాయాలి. —సం॥

పండిత డి. గోపాలాచార్యులువారి
అరుణ
స్త్రీల
ఆరోగ్య సౌభాగ్యానికి
1898 నుండి ప్రసిద్ధిగాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
100, జి. ఎన్. రోడ్, మద్రాసు-17.

ఉచితము! ఉచితము!! ఉచితము!!!
తెల్ల మచ్చలకు
ఉచిత వైద్యము
శక్తివంతమైన వనమూలికా యుర్వేద ఔషధము "SWETARI" తెల్ల మచ్చలను కొద్ది రోజులలో తొలగించును. సాంఘిక సంక్షేమం కొరకు 1000 రోగులకు ఒక్కొక్క పాకెట్ ఉచితంగా ఇవ్వబడును. వెంటనే వ్రాయండి.
Sri Krishna Chandra Vaidya
(A.P.) P.O. Katrisarai (Gaya)

రు. 2790/- వరకు
సంపాదించండి.
మా కో—ఆపరేటివ్ స్కీము ద్వారా 3 నెలలలోగా సంపాదించండి వివరము లకు మరియు మీ పాలిసికి వ్రాయండి.
M. M.C. SCHEME (WAPM)
5A, Ansari Road, Delhi-6

# చెదు మాత్ర

దించాడు లక్ష్మి...సరస్వతి రెండూ అరుదుగాగాని ఒకచోట కలియవు. కాలేజీలో 'ఆర్ట్స్ ఎగ్జిబిషన్' ఒకటి త్వరలోనే జరుగబోతుంది. దానిలో ఉత్తమ చిత్రాలకు బహుమతులు కూడా ఏర్పాటు చేయబడ్డాయి ...ఒకమంచి ప్రకృతిచిత్రం గీయాలని సంకల్పించి బి. ఏ. చదువుతున్న ధనికుల లబ్బాయి. అన్నట్లు మరిచేపోయాను ఆ అబ్బాయి పేరు క్రిష్ణమూర్తి ... ప్రసాదరావుగారు చెప్పడం ఆపుచేసి చిన్నగా నవ్వాడు — శేఖరం ఆసక్తిగా వింటూ కూర్చున్నాడు.

'కారు తీసుకుని దగ్గరలోఉన్న కొండల దగ్గరకు ప్రకృతి చిత్రాలు గీయడానికి ఇంట్లోచెప్పి బయలుదేరాడు. ఎత్తయిన కొండలు...దట్టమైన అడవుల మధ్యనుండి వినిపిస్తున్న పక్షుల కిలకిలా రావాలు ... కొండల శిఖరాలను తాకుతూ పయనిస్తున్న మేఘాలు. ఓహ్ ... క్రిష్ణమూర్తి పరవశించి పోయాడు. అక్కడో చిన్న 'ట్రావలర్స్ బంగళాలో' గది తీసుకుని రకరకాల చిత్రాలు గీయడం మొదలుపెట్టాడు — ఎన్ని బొమ్మలుగీసినా తనివి తీరలేదు. అపుడే —అక్కడే పరిచయమయిందిమోతీ...

ప్రసాదరావుగారు బిగ్గరగా నవ్వారు — శేఖరంకూడా శృతికలిపాడు.

'నువ్వే మనుకుంటున్నావో చెప్పనా ...' ఈయనగారు నాకు ఒక 'ఫార్ములా' కథ చెబుతున్నాడనికదూ... కాని శ్రద్ధగావిను. 'ఒకమ్మాయి కనిపించడం ... యాంత్రికంగా అబ్బాయి ప్రేమించడం ... విఫలమైతే అదో గొడవ!! సరే... 'మోతీని' చూసిన మొదటి క్షణమే క్రిష్ణ చాలా గాఢంగా ప్రేమించాడు. ప్రకృతి సౌందర్యమంతా మూర్తీభవించిన మోతీబొమ్మ ఒకటి గీశాడుకూడా.

మోతీ ఎవరోతెలుసా... ఆ అడవుల్లో నివసించే ఒకతెగకు చెందిన అడవిపిల్ల!

కొద్దిరోజుల్లో పట్నంనుంచి తిరిగివచ్చి నిన్ను సగౌరవంగా ఇంటికి తీసుకెళతానని చింత ఏమాత్రం పడవలదని...నాప్రేమ చాలా నిష్కలంకమైనదనీ...ఇంకా ఇలాంటివే కొన్ని మామూలు మాటలు చెప్పాడు.

మోతీ జాలిగా, ప్రేమగా, దీనంగా క్రిష్ణనిచూసి చిన్నగా నవ్వింది.

మోతీ గర్భంలో పెరుగుతున్న శిశువు సాక్షిగా క్రిష్ణచేతిలో చేయివేసి ఇంటికి బయలుదేరాడు.

శేఖరం అర్థమయిందన్నట్లు చిన్నగా నవ్వాడు — ప్రసాదరావుగారు చుట్ట ఏష్ట్రేలోవేసి శృతికలిపాడు.

'ఇక మీరేమీ చెప్పకండి...మిగిలినకథను నేను ఊహించుకోగలను—ఎవరోపాపం మోతీ క్షేమం కోరినవారు ఈ ఉత్తరాన్ని క్రిష్ణమూర్తికి వ్రాసిఉంటారు అంతేగదూ! తర్వాత మోతీ బహుశా ఆత్మహత్య చేసుకుని ఉంటుంది. క్రిష్ణమూర్తి తల్లిదండ్రులు మోతీతో వివాహానికి ఒప్పుకోరుగా!'

శేఖరం చెప్పడం ఆపుచేశాడు ఆయన తలూపాడు. శేఖరానికి చాలా తేలికగా అనిపించింది ఏదో పెద్ద బరువు దించినట్లు— సమస్య విడిపోయి నట్లనిపించింది. లేచి నుంచుని 'నేను వస్తానండీ...మొత్తానికి కథ బాగానే వ్రాశారు' ... చేతులు జోడించాడు.

ప్రసాదరావుగారు సోఫాలో వెనక్కువాలి కండ్లు మూసుకుని చిన్నగా చేయిపూపాడు. శేఖరం మేడ వరండాదాటి గేటువేపు రెండడుగులు వేశాడు—గేటు తలుపులు తెరుచుకుని ఇరవైఏండ్ల పసిమి బంగారు రంగుగల అందమయిన అమ్మాయి కారులో నుండి బయటకు కాలు పెట్టింది.

శేఖరం కండ్లు నులుముకుని చూశాడు. ఆ అమ్మాయికి కుడిచేయిలేదు. దాని మీదుగా ఎంతనిండుగా పమిట కప్పుకున్నా స్పష్టంగా కనిపిస్తూనే ఉంది. శేఖరం మనసంతా ఆదోలా అయిపోయింది. పెద్ద బరువు తలమీద పెట్టినట్లు, చిక్కుల సమస్యకు సమాధానం దొరకనట్లు వెనక్కి తిరిగి ప్రసాదరావుగారి వేపు చూశాడు.

అయనకండ్లు కన్నీరు నింపుకుని దీనంగా ఏదో అర్థిస్తున్నట్లు చూస్తున్నాయి. శేఖరం గుండె కెలికినట్లయింది. ఆ అమ్మాయి లోనికి అడుగుపెట్టింది. శేఖరం గేటువేపు వడివడిగా అడుగులు వేశాడు ...